'బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది'

బీర్ల అయిలయ్య


బీర్ల అయిలయ్యను సన్మానిస్తున్న వక్కలంక శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రూ.50కోట్లు కేటాయించారని ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. బ్రాహ్మణుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల కేటాయింపునకు కృషి చేసిన బీర్ల అయిలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు శుక్రవారం ఆయనను కలిసి సత్కరించారు. విదేశీవిద్యకు సంబంధించిన 800 మంది బ్రాహ్మణ విద్యార్థులకు రూ.150 కోట్లను విడుదలయ్యేలా చూడాలని కోరారు. అదే విధంగా జిల్లాల్లో బ్రాహ్మణ భవనాలు వేద పాఠశాలలు, కల్యాణ భవనాలు, గోశాలల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మంగపతిరావు, స్వరూప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల కల సాకారం

ఎమ్మార్పీఎస్ నాయకుడు గండి కృష్ణమాదిగ


వీఎస్టీ చౌరస్తాలో అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ/ముషీరాబాద్: మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తర్వాత ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పు మాదిగ సమాజం మార్చిపోలేని రోజని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గండి కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ ఎమ్మార్పీఎస్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాదిగ అమరవీరులకు అంకితం చేస్తున్నామని అన్నారు. సహకరించిన ప్రధాని మోదీ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్ముగూడెం దశరథ్, గజ్జల రాజశేఖర్‌మాదిగ, చిలుక ఎల్లయ్య, ఆర్.వినయ్‌రావు, ఇల్లందుల ఎల్లయ్య, ఆర్ వెంకటేష్, ఎల్ నిర్సంగరావు, పి.రాజు పాల్గొన్నారు.

వీఎస్టీ చౌరస్తాలో..

ముషీరాబాద్: నియోజకవర్గ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జ్ఞానీ ఆధ్వర్యంలో శుక్రవారం వీఎస్టీ చౌరస్తాలో సుప్రీంకోర్టు తీర్పుపై నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగులు, సాయిలు, కిషోర్, ఆకారం శ్రీనివాస్, మేడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై మాల సంఘాల నిరసన


లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల సంఘాల నేతలు

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల సంఘాల జేఏసీ నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ నేతలు జి.చెన్నయ్య, సుప్రీంకోర్టు తీర్పు ప్రతులను దహనం చేశారు. చెరుకు రాంచందర్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ తీర్పులో కేంద్ర ప్రభుత్వం హస్తం ఉందన్నారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని మండిపడ్డారు. సుప్రీం కోర్టు తీర్పు 341వ రాజ్యాంగ అధికరణకు విరుద్ధమన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పుపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. అనంతరం రోడ్డు పైకి దూసుకెళ్లిన మాల సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేశారు.

హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాబంధా)



మాట్లాడుతున్న మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆగస్టు 8వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా పెంచిన ఫించన్‌లు, కొత్త రేషన్‌కార్డులు, పేదలకు ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతు భరోసాకు రూ.15వేలు వంటి హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఆగస్టు 21న 'చలో హైదరాబాద్' పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు రాంచందర్, రమా, రంగయ్య, చంద్రన్న, జి.వెంకటేశ్వర్‌రావు, అన్వేష్, ఎస్ఎల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేయాలి

ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

ముషీరాబాద్: విద్యార్థులు తమ చదువులతో పాటు సమాజంలో అసమానతలు ఆర్థిక అంతరాలు రూపుమాపేందుకు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గోల్కొండ క్రాస్ రోడ్స్‌లో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ఆధిపత్య వర్గాల భావజాలం అధికార భావజాలంగా ఉందన్నారు. బలహీన వర్గాలు, పేదలకు అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి, రమ్య, రమేష్, నాగేందర్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట


మల్లికార్జుననగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున నగర్‌లో రూ.80 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చందు, మిర్యాల రవీందర్, అధికారులు ప్రవీణ్‌కుమార్, వాజీద్, సౌమ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

మెదడువాపు నివారణకే 'జేఈ' వ్యాక్సిన్


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది


పిల్లలకు టీకా వేస్తున్న వైద్య సిబ్బందితో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా

ముషీరాబాద్: మెదడువాపు నివారణకు 9నెలల శిశువు నుంచి 15 సంవత్సరాలలోపు చిన్నారులకు తప్పనిసరి జపనీస్ ఎన్సెఫలిటిస్(జేఈ) వ్యాక్సిన్ వేయించాలని పీహెచ్ఎన్ ఫెల్లిస్ పేర్కొన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్ వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ వ్యాక్సిన్ వల్ల పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఏఎన్ఎంలు విజయకుమారి, సునిత, ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నరేందర్‌యాదవ్, జూనియర్ అసిస్టెంట్ రతన్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

'జేఈ' టీకా తప్పనిసరిగా వేయించాలి

కాచిగూడ: 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు జేఈ టీకా తప్పనిసరిగా వేయించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా అన్నారు. శుక్రవారం కాచిగూడలో వైద్యసిబ్బంది, కార్పొరేటర్ పలు ప్రాంతాల్లో పర్యటించి పిల్లలకు జేఈ టీకా వేయించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మదర్సాల్లో టీకా వేస్తారని ఆమె తెలిపారు.రీ కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌ఓ సాయిబాబా, డా. మనోజ్‌రెడ్డి, సిస్టర్స్ ఇందిరా, రమా, ఆశావర్కర్స్ సబిత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత



ఫ్రై డే - డ్రై డే అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ అమృత, సిబ్బంది


జైస్వాల్ గార్డెన్ ఏరియాలో యాంటీ లార్వా మందును పిచికారి చేయిస్తున్న దృశ్యం

అంబర్‌పేట: దోమల నిర్మూలనతో వ్యాధులు దరిచేరవని జీహెచ్ఎంసీ సర్కిల్-16 ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత తెలిపారు. దోమల నిర్మూలన కోసం ప్రతి శుక్రవారం 'ఫ్రై డే - డ్రై డే' కార్యక్రమం నిర్వహించారు. గోల్నాక జైస్వాల్ గార్డెన్‌లో ఎంటామాలజీ విభాగం అధికారులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి దోమల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ... ప్రస్తుత వర్షకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందన్నారు. వాటిని నిర్మూలించేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు చింతాల శ్రీనివాస్ ముదిరాజ్, ప్రసన్నంజనేయులు, మధుసూదనాచారి, అనిల్‌చారి, గోపాల్, సత్యనారాయణ, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలి

నల్లకుంట: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత ప్రజలకు సూచించారు. ఇందులో భాగంగా ప్రతి శుక్రవారం అందరూ 'డ్రై డే' పాటించాలని అన్నారు. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో 'అర్బన్ మలేరియా పథకం'లో భాగంగా శుక్రవారం నల్లకుంటలో డ్రై డే.. ఫ్రై డే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ మలేరియా.. సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్‌లో నిర్వహించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన మలేరియా సిబ్బంది ఇళ్లల్లోని పూల కుండీలు, నీటి తొట్టెలలో నిల్వ నీటిని పరిశీలించారు. నీరు నిల్వ ఉంటే దోమల లార్వా వృద్ధి చెందుతుందని నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందితే రోగాలు వ్యాప్తి చేందుతాయని చెప్పారు.

◆ కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజులకోసారి మార్చాలన్నారు. ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదన్నారు. కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు పరిసరాల్లో ఉంచకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే రోడ్లు, కాలువలను రోజూ శుభ్రం చేయాలన్నారు. ఎక్కడా చెత్త కనిపించకుండా ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఎఫ్ఏ కిషన్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అభినందనలు


డా.కొంపల్లి అజయ్‌ను అభినందిస్తున్న చిక్క దేవదాస్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డీజీపీ కార్యాలయం పబ్లిక్ ప్రాసిక్యూటర్, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆఫీస్ ఓటీడీగా డాక్టర్ కొంపల్లి అజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాజయోగి, డా. చిక్కదేవదాస్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.లక్ష్మణ్, తెలంగాణ ఐటీ విభాగం సహాయ కార్యదర్శి తిరందాసు యాదగిరి, దేవెళ్ల శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

చిక్కడపల్లి: తూనికలు, కొలతలు శాఖ జిల్లా రీజినల్ కంట్రోలర్ కె.శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సభ శుక్రవారం గాంధీనగర్‌లో ఆశాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. శ్రీనివాస్ అంకిత భావంతో పనిచేశారని అధికారులు ప్రశంసించారు. ఎస్ఏసీ ఎస్.రాజేశ్వర్, రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ జగన్మోహన్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా కంట్రోలర్ శివానంద్ తదితర అధికారులు హాజరై శ్రీనివాస్‌ను సత్కరించారు.


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న స్టేట్ ఏసీ రాజేశ్వర్, ఏసీలు జగన్మోహన్‌రెడ్డి, శివానంద్

నర్సింగ్ కౌన్సిల్ అక్రమాలపై విచారణ జరిపించాలి


వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకులు

కాచిగూడ: తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణకు ఆదేశిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బీసీ యువజన సంఘం ప్రతినిధి బృందం మంత్రిని కలిసి నర్సింగ్ కౌన్సిల్‌లో అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తున్న కౌన్సిల్ రిజిస్ట్రార్ బండ విద్యావతిపై ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. నర్సింగ్ కాలేజీలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకృష్ణ, సాయికృష్ణ, మధు, మహేష్, నిరంజన్, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కిల్ యూనివర్సిటీ ప్రైవేటు, పబ్లిక్ పార్టనర్‌షిప్‌లో కాకుండా ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ప్రైవేటు, పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్‌ల వల్ల యూనివర్సిటీలో పూర్తి చేసే కోర్సులకు విద్యార్థులు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు స్కిల్స్‌ను ఉచితంగా అందించే బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకున్నట్లే అని తెలిపారు.

సుప్రీం తీర్పు సామాజిక న్యాయానికి ప్రతిబింబం

బీఎల్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సామాజిక న్యాయానికి ప్రతిబింబంగా ఉందని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌పీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ నాయకత్వంలో చేస్తున్న పోరాటాలకు సుప్రీంకోర్టు తీర్పుతో వర్గీకరణ సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లో విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. ఎస్టీ తెగలైన ఆదివాసి, న్యాయకపోడు, ఎరుకల, లంబాడ తదితర ఎస్టీ గిరిజన తెగలకు సామాజిక న్యాయం అందుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అమలు కోసం ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాదిగ దండోర ఉద్యమ స్ఫూర్తితో బీసీ కులాల ప్రజలు అన్ని రంగాల్లో నూతన వాటా కోసం ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సబ్బని లత, కె.మధు, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు గురు పూర్ణిమ

చిక్కడపల్లి: కనకదుర్గ నృత్య విభావరి ఆధ్వర్యంలో గురు పూర్ణిమ మహోత్సవ వేడుకలను ఈనెల 3వ తేదీన నిర్వహిస్తున్నామని నిర్వహణ సంస్థ డైరెక్టర్ నిర్మలాప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం త్యాగరాయ గానసభలో సాయంత్రం 5.30గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. నృత్య గురువులకు గురు సత్కారం కార్యక్రమం ఉంటుందన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

ముషీరాబాద్: బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలను ప్రజలు ప్రోత్సహించి బ్రాండ్ విజిబిలిటీని పెంచాలని సీజీఎం ఏరియా-1 అధికారి చంద్రశేఖర్ కోరారు. ముషీరాబాద్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు శుక్రవారం ముషీరాబాద్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ నుంచి గోల్కొండ చౌరస్తా, బాకారం, స్పెన్సర్ మార్కెట్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ 4జీ, ఫైబర్ బ్రాడ్ బ్రాండ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర మండలం డీజీఎంఎం నర్సింహులు, ముషీరాబాద్ ఏజీఎం మురళీకృష్ణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శి కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు.

◆ నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలో నెహ్రూనగర్, కృష్ణానగర్, గోల్నాక చర్చి, డిమార్ట్, దయారా మార్కెట్ ఫీడర్ పరిధిలో రిసాల, సాగర్‌లాల్ ఆసుపత్రి, హరినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు,

◆ ఆజామాబాద్, మూన్‌కేఫ్ ఫీడర్ల పరిధిలోని అచ్చుత్‌రెడ్డి మార్గ్, సీపీఎం ఆఫీస్, రాంనగర్ గూండు, విద్యానగర్ పోస్టు ఆఫీస్, శ్రీరామ్‌నగర్, మూన్ కేఫ్, హెరిటేజ్ ఫ్రెష్, అచ్చయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి 11.30గంటల వరకు..

◆ చిక్కడపల్లి, బాపునగర్, శాస్త్రీనగర్ ఫీడర్ల పరిధిలోని చిక్కడపల్లి, ఉమా గార్డెన్, వెంకటేశ్వర టెంపుల్, ఓవైసీనగర్, నెక్లెస్ హోటల్, ఆకాష్‌నగర్, శాస్త్రీనగర్, మోహన్‌నగర్, రాంనగర్, జెమిని కాలనీ, సెయింట్ పాయిస్ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు,

◆ ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలోని పటేల్‌నగర్ చౌరస్తా, హనుమాన్ టెంపుల్, సుమర్‌బోలీ, ఉదయం స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకు..

◆ సీసీ షరఫ్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని భూమన్నగల్లి, లింగంపల్లి, రాజేంద్రనగర్ కాలనీ, కాచిగూడ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటి గంట వరకు..

◆ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో అంజయ్య క్వాటర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పురా పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్‌గా రాజశేఖర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అఖిల భారత ప్రజా తంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) జాతీయ కన్వీనర్‌గా మేత్రే రాజశేఖర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఎంసీపీఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా రాజు పాశ్వాన్, అమన్, గడ్డం నాగార్జున, పల్లె మురళీ, పి.కాశీ, సంజీవ్‌చౌహాన్, ఆదర్శ్, బబ్లూ, జబ్బర్‌నాయక్, రవీందర్‌సింగ్, ఆనంద్‌ను ఎన్నుకున్నారు.

రేపు మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి వేడుకలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కళలను కాపాడుకోవడంతో పాటు వలసలను నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాయిద్యా కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఎల్‌వీ చెన్నారావు అన్నారు. ఈ 4వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం జయంతి వేడుకల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియో బీబీసీ ఆస్పత్రి ఎండీ డా. మంచుకొండ రంగయ్య, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు బీవీమోహన కృష్ణ, ఎస్.భరత్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికుల అవస్థలను తీర్చాలని సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ కార్యదర్శి దశరథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదే స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదన్నారు. ప్రయాణికులకు అనుగుణంగా బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు పి.మహేందర్, కె.రమేష్, కె.వీరయ్య, శ్రీనివాస్, మల్లయ్య, రాజు, శ్రీరాములు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించారు

సాక్షి ఎఫెక్ట్..

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై అధికారులు స్పందించారు. ఈ విషయంపై శుక్రవారం 'సాక్షి'లో వార్త ప్రచురితం కావడంతో అధికారులు అక్కడకు చేరుకుని మరమ్మతులు చేయించారు. ఈ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జూకల్ - ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (30) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ ఎస్.కృష్ణఆదిత్య

చిక్కడపల్లి: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు ఉత్సవాలు నిలుస్తాయని రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ ఎస్.కృష్ణఆదిత్య అన్నారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో ప్రాంగణంలోని దుర్గా నల్లపోచమ్మ అమ్మవారి దేవాలయంలో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. బ్యాండ్ మేళాలు మధ్య మహిళా ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కమిషనర్ కృష్ణ ఆదిత్య, రాష్ట్ర అదనపు కమిషనర్ డా. గంగాధర్, రాష్ట్ర జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కమిషనర్ శ్యామ్ సుందర్‌రెడ్డి, నగర సంయుక్త కమిషనర్ సునీత తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉద్యోగులు సుధీర్, శేఖర్, శ్రీనివాస్, రాజు, వినోద్‌ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో డిప్యూటీ లేబర్ కమిషనర్లు శ్యామ్‌సుందర్ జాజు, శ్రీనివాస్‌గౌడ్, ప్రమోద్‌రెడ్డి, నీలమ్మ, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్‌గౌడ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్లు సత్యనారాయణరెడ్డి, జీసస్, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌వర్క్స్ కార్యాలయంలో...

చిక్కడపల్లిలోని వాటర్‌వర్క్స్ కార్యాలయంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని, జీఎం రామకృష్ణ, సీజీఎం ప్రభు, డీజీఎం కార్తీక్‌రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, నేతలు వినయ్‌కుమార్, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, సురేందర్, ఉమేష్, సాయికుమార్, ఆనంద్‌రావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్శిగుట్టలోని ఎల్లమ్మ దేవాలయంలో...

ముషీరాబాద్: ఆషాఢమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పార్శిగుట్టలోని ఎల్లమ్మ దేవాలయంలో బీఆర్ఎస్ యువజన నేత ముఠా జైసింహ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోనాల ఉత్సవాలను ఆలయ కమిటీ వైభవంగా నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తోందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, శ్రీకాంత్, భాస్కర్‌నేత, సత్యనారాయణ పాల్గొన్నారు.


లేబర్ కమిషనర్ కార్యాలయంలోని నల్లపోచమ్మ ఆలయ పూజలో అధికారులు


వాటర్‌వర్క్స్ కార్యాలయంలో బోనాల వేడుకలో కార్పొరేటర్ పావని, అధికారులు